



ప్రత్యేక అలంకరణలో కోటదుర్గమ్మ

కోటదుర్గమ్మా.. కరుణించు!

- తల్లి నిజరూపం .. పులకించిన భక్తజనం
- శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



సాలూరు రూరల్: పసుపు కొమ్ముల అలంకరణలో కామాక్షి అమ్మవారు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పన్నెండు రోజుల పాటు తెరచాటున ఉన్న అమ్మవారు గురువారం నిజరూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఈ భాగ్యం కలగడంతో భక్తజనం కనులారా కోటదుర్గమ్మను దర్శించి పులకించిపోయారు. జైజై దుర్గమ్మ అంటూ నామస్మరణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 8 గంటలకు ముహూర్తపురాట, కలశ స్థాపన చేశారు. పాల కొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. సూర్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం ఐదు గంటల నుంచే భక్తుల తో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తెలంగాణా, ఒడిశా నుంచి వేలాదిగా తరలివచ్చిన వారు క్యూలైన్లలో బారులు దీరారు. ప్రత్యేక, శీఘ్ర, వీవీఐపీ, ఉచిత దర్శనాలకు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మంది వరకు వచ్చి ఉంటారని అధికారుల అంచనా. కాగా క్యూలైన్లలో ఉన్న భక్తులకు తాగునీరు, మజ్జిగతో పాటు చిన్నారులకు పాలను అందించారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిజరూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మరోవైపు కోటదుర్గ ఉత్సవ విగ్రహాన్ని తొలిరోజు బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మంది పోలీసులతో డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళి బందో బస్తు నిర్వహించారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో దాదాపు 300 మంది భవానీ దీక్షలు చేపట్టారు. పాలకొండ సబ్ కలెక్టర్, యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, అన్నదాన ఏర్పాట్లను పరిశీలించారు.



పాలకొండ: క్యూలైన్‌లో ఉన్న భక్తులు

కురుపాం కోటలో పూజలు..



కోటలో పూజలు చేస్తున్న కిశోర్ చంద్రదేవ్

కురుపాం, అక్టోబరు 3: కురుపాం కోటలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాజవంశీయుడు, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్‌చంద్ర దేవ్ కుటుంబసభ్యులు గురువారం కోట దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన పురోహితుల ఆధ్వర్యంలో కిషోర్ చంద్రదేవ్ కోటలో ఆయుధాలను పల్లకిలో తీసుకెళ్లి.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుర్గ గుడిలో అలంకరించారు. ఈ పూజల్లో కిషోర్ చంద్రదేవ్ సతీమణి ప్రీతిదేవి, కుమార్తె శృతీ దేవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌కుమార్ దేవ్ కూడా కోటలో, రావాడ రోడ్డు కూడలి వద్ద ఉన్న కోటదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైలు వస్తుందోచ్..

- సాలూరు-విశాఖ వయా బొబ్బిలి మధ్య నడవనున్న ట్రైన్
- నేడు ట్రయల్ రన్

బొబ్బిలి, అక్టోబరు 3: సాలూరువాసుల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. ఎప్పుడెప్పుడా అని వేయి కళ్లతో ఎదురు చూస్తున్న వారి నిరీక్షణకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది. సాలూరు నుంచి బొబ్బిలి మీదుగా విశాఖపట్నం వరకు నడపనున్న ప్యాసింజరు రైలుకు శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖలో ఉదయం 10 గంటలకు ఈ రైలు బయలుదేరనుంది. మధ్యాహం 12.30 గంటలకు బొబ్బిలి, 1.10 గంటలకు సాలూరుకు చేరుకోనుంది. తిరిగి సాలూరు నుంచి మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు విశాఖ చేరుకోనుందని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో సాలూరు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైలు బస్సు ఇక లేనట్టేనా?



బొబ్బిలి, సాలూరు ప్రాంతాల నుంచి విశాఖ, విజయనగరం ప్రాంతాలకు రోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, గతంలో బొబ్బిలి-సాలూరు మార్గంలో రైలు బస్సు నడపడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. కాగా ఈ రైలు బస్సును కరోనా కాలం నుంచి పూర్తిగా నిలిపివేశారు. దీంతో ఈ రెండు పట్టణాల మధ్య గల అనేక గ్రామాల ప్రజలు విశాఖ, విజయనగరం రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. అదనపు బోగీలతో కూడిన ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఎన్నో ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యం. ఇటీవల దుర్గ్ నుంచి విశాఖకు వందేభారత్ రైలును ఏర్పాటు చేశారు. ఆ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ లేకపోవడంతో ఈ ప్రాంత ప్రయాణికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇక్కడ హాల్ట్ కల్పించాలని కోరుతూ ఇటీవల కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు వినతులు సమర్పించారు. వందేభారత్ రైలు టికెట్ చార్జీలు సామాన్యులకు అందుబాటులో లేని కారణంగా బొబ్బిలి నుంచి విశాఖ లేదా విజయనగరం షటిల్ రైలు సర్వీసులు పెట్టాలని, బొబ్బిలి-నుంచి సాలూరుకు గతంలో మాదిరిగా రైలు బస్సు నడపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఇవి సర్వే రాళ్లే..

సాలూరు రూరల్: చిన్న చిన్న బండరాళ్లను పేర్చి.. ఇలా చేశారనుకుంటే పొరబడినట్టే. ఇవి జగనన్న సర్వే రాళ్లు. వృథాగా పడి ఉండడంతో ముచ్చర్లవలసలో ఇలా వినియోగిస్తున్నారు. దుకాణానికి, పడుకోవడానికి, బస్సు కోసం చెట్టు కింద నిరీక్షించడానికి వీలుగా స్థానికులు ఇలా వినియోగిస్తుండడంపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఏదోలా వినియోగపడుతున్నాయిలే అని కొందరు సరిపెట్టుకోగా.. కోట్లాది రుపాయాల ప్రజాధనం వృథా అయ్యిందని మరికొందరు వాపోతున్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం భూముల రీ సర్వే పేరుతో హడావుడి చేసింది. గ్రామాల్లో డ్రోన్ ఎగుర వేసి సందడి చేసింది. అనంతరం జగన్ బొమ్మలున్న సర్వే రాళ్లను పొలాల సరిహద్దుల్లో పాతి పెట్టాలని ఆదేశించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో అది అమలు కాలేదు. దీంతో వృథాగా పడి ఉన్న ఈ సర్వే రాళ్లను ఒక్కో గ్రామంలో ఒక్కోలా వినియోగిస్తున్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి

పార్వతీపురం, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవ నాయుడు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2025లో భాగంగా జిల్లాలో సర్వే చేపట్టామన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా పరిశీలించినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 7,83,972 ఓటర్లు ఉండగా.. వారిలో 7,82,260 ఓటర్లు ధ్రువీకరించినట్టు తెలిపారు. ఫారం 6,7,8 సంబంధించి 5,140 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో 291 తిరస్కరించినట్లు చెప్పారు. 1064 దరఖాస్తులను పరిష్కరించామని, 3,758 ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. రాయివలస, బొత్తిలిలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్టు తెలిపారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు

పీఎం జుగాతో గిరిజన గ్రామాల అభివృద్ధి: కలెక్టర్



పార్వతీపురం, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన జాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ (పీఎం జుగా) తో గిరిజన గ్రామాల అభివృద్ధి చెందనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా సత్ఫలితాలు సాధించిన గ్రామాలకు కేంద్రం రూ. 22 లక్షల వరకు ప్రత్యేక గ్రాంటు ఇస్తుందన్నారు. పీఎం జుగాతో జిల్లాలో 500 మందికి పైగా గిరిజనులు ఉన్న గ్రామాలు 165 ఉండగా, మైదాన ప్రాంతాల్లో 50 మందికి పైగా ఉన్న గ్రామాలు 703 వరకూ ఉన్నాయని చెప్పారు. ఆయా గ్రామాల్లో ప్రజలంతా కేంద్ర పథకంతో లబ్ధి పొందుతారని కలెక్టర్ తెలిపారు. ఇళ్లు, రోడ్ల నిర్మాణం, సోలార్ విద్యుత్ సౌకర్యం, సంచార మెడికల్ యూనిట్లు, ఆదివాసీ అతిథిగృహాలు, అంగన్‌వాడీ సెంటర్లు, ఎఫ్ఆర్ఏ పట్టా భూములు ఉన్న వారి ఆదాయం రెట్టింపు చేయడం వంటి 25 కార్యాచరణలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ పప్పన్నం లేదా?



- జిల్లాకు పూర్తిస్థాయిలో సరఫరా కాని కందిపప్పు, పంచదార
- బియ్యం పంపిణీతోనే సరిపెట్టేస్తున్న వైనం
- పండగ నెలలోనూ అదే పరిస్థితి..
- అమలు కాని ప్రభుత్వ ఆదేశాలు
- కొన్నిచోట్ల ఇవ్వకుండానే.. ఇచ్చినట్లుగా రికార్డుల్లో నమోదు
- ప్రతినెలా అరకొరే.. నష్టపోతున్న ఆఫ్‌లైన్ లబ్ధిదారులు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- రేషన్ కార్డుదారులకు తప్పని అవస్థలు

పార్వతీపురం, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు దారులకు పూర్తిస్థాయిలో బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ప్రతినెలా జిల్లాలో అరకొరగానే సరుకుల పంపిణీ జరుగుతోంది. బియ్యం మినహా కందిపప్పు, పంచార అందరికీ అందించడం లేదు. కొన్నిచోట్ల బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చి మమ అనిపిస్తున్నారు. ఈ నెలలో దసరా, దీపావళి పండగలు ఉన్న నేపథ్యంలో కార్డుదారులకు తప్పనిసరిగా కందిపప్పు అందించాలని ప్రభుత్వం ప్రకటించినా.. పరిస్థితేమీ మారలేదు. దీంతో జిల్లావాసులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం డివిజన్‌లో ఎనిమిది మండలాలు, పాలకొండ డివిజన్‌లో ఏడు మండలాలున్నాయి. వాటి పరిధిలో ఎనిమిది ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. మొత్తంగా 578 రేషన్ డిపోలో ఉన్నాయి. 196 ప్రాంతాల్లో 27 ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు సరుకులు అందిస్తున్నారు. పార్వతీపురం డివిజన్‌లో 1,56,418, పాలకొండ డివిజన్‌లో 1,24,833 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిల్లో 33,469 కార్డులకు 60 ఎండీయూ వాహనాల ద్వారా ఆఫ్‌లైన్‌లో సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో థంబ్ ద్వారా సరుకులు సరఫరా చేస్తారు కాబట్టి కార్డుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. కానీ ఏజెన్సీలో కొన్నిచోట్ల అది వీలు పడదు. సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లోనే సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది ఒక్కోనెల కందిపప్పు, పంచదారను కార్డుదారులకు పంపిణీ చేయకుండానే.. చేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కొరవడడంతో సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. మొత్తంగా ఆఫ్‌లైన్ కార్డుదారులు నష్టపోతున్నారు.

అంతంతమాత్రంగానే సరఫరా ..

- జిల్లాలో రేషన్ కార్డుదారులకు అవసరమైన 5,116 మెట్రిక్ టన్నుల బియ్యం పూర్తిస్థాయిలో సరఫరా జరుగుతుంది. 169.472 మెట్రిక్ టన్నుల పంచదార, 281.251 మెట్రిక్ టన్నులు కందిపప్పు అవసరమైనప్పటికీ ప్రతినెలా అరకొగానే అవి సరఫరా అవుతున్నాయి. దీంతో కార్డుదారులందరికీ పూర్తిస్థాయిలో అవి అందడం లేదు. ఒక్కోనెల రెండూ పంపిణీ చేయడం లేదు. కేవలం బియ్యం అందించి చేతులు దులుపుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు కిలో ధర రూ.150 వరకు ఉంది. ఎండీయూ వాహనాల ద్వారా రూ.67కే అందజేయాల్సి ఉంది. కానీ ఈ నెలలో జిల్లాకు 210 మెట్రిక్ టన్నులు కందిపప్పు అవసరం కాగా.. ఇప్పటివరకు కేవలం 15 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది.

ప్రతినెలా అంతే..

- జిల్లాలో సెప్టెంబరు నెల కోటా కింద 210 మెట్రిక్ టన్నులు కందిపప్పు అవసరం. కాగా కేవలం 50 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. ఇది కూడా సకాలంలో రాలేదు. దీంతో ఆఫ్‌లైన్‌లో నిత్యావర సరుకులు పొందే కార్డుదారులకు కందిపప్పు అందలేదు. ఇక జూన్ నెలలో చూసుకుంటే.. 144 మెట్రిక్ టన్నులు కందిపప్పు సరఫరా అవ్వగా.. ఆఫ్‌లైన్‌లో దానిని సరఫరా చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో కార్డుదారులకు పూర్తి స్థాయిలో కందిపప్పు అందలేదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మే, జూలై, ఆగస్టు నెలల్లో అయితే పూర్తిగా కందిపప్పు సరఫరా జరగలేదు.
- పంచదార విషయానికొస్తే.. గత నెలలో 153 మెట్రిక్ టన్నులు అవసరం. అయితే కేవలం 70 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. అరకొర సరఫరా కారణంగా ఆఫ్‌లైన్‌లో కార్డుదారులందరూ నిత్యావసరాలను పొందలేక పోతున్నారు. కొన్ని ప్రాంతాలకే సరుకులు పరిమితం కావడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

మరికొన్ని రేషన్ డిపోలు...

జిల్లాలో 800 రేషన్ కార్డులు దాటిన ప్రాంతాల్లో మరో డిపో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. వాటి సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అధికారులు కూడా ఈ ప్రక్రియలోనే ఉండగా.. కొంతమంది రేషన్ డిపో డీలర్లు కోర్టును ఆశ్రయించారు. దీంతో కొత్త డిపోల ఏర్పాటుకు బ్రేక్ పడింది. న్యాయ స్థానంలో విషయం తేలిన తర్వాత కొత్తగా 43 రేషన్ డిపోలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

కఠిన చర్యలు తప్పవు

ఆఫ్‌లైన్ ద్వారా రేషన్‌కార్డుదారులకు నిత్యావసర సరుకులన్నీ ఇవ్వాలి. ఇవ్వకుండా ఇచ్చినట్టు రికార్డుల్లో నమోదు చేస్తే.. కఠిన చర్యలు తప్పవు. ఈ నెల 210 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం కాగా.. 15 మెట్రిక్ టన్నులు వచ్చింది. ఈ మేరకు పంపిణీ చేస్తున్నాం.

\- శ్రీనివాసరావు, డీఎం, సివిల్ సప్లైస్



సీతంపేట పరిధిలో..

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏ పరిధిలో రేషన్ కార్డుదారులకు ఈ నెల కందిపప్పు ఇవ్వడం లేదు. బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. ఇదేంటని కార్డుదారులు ప్రశ్నిస్తుండగా.. కందిపప్పు రాలేదని, తరువాత పంపిణీ చేస్తామని ఎండీయూ వాహనాల ఆపరేటర్‌లు సమాధానమిస్తున్నారు. వాస్తవంగా సీతంపేట సివిల్ సప్లైస్ గొడౌన్ పరిధిలో సీతంపేట, భామిని మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 30 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. 23 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్‌కార్డు దారులకు నిత్యావసర సరుకులను అందిస్తున్నారు. ప్రతినెలా 30 టన్నుల కందిపప్పు అవసరం కాగా ఈ నెల 2టన్నులు(2 వేల కేజీలు) మాత్రమే గొడౌన్‌కు స్టాక్ వచ్చింది. దీంతో కార్డుదారులకు సరఫరా నిలిచిపోయింది. 'సీతంపేట, భామిని మండలాలకు 30 టన్నుల కందిపప్పు అవసరం. గతనెల 30న సాయంత్రం 2టన్నులు మాత్రమే గొడౌన్‌కు వచ్చింది. మరోవైపు డీఆర్ డిపోల సేల్స్‌మెన్ థంబ్‌ల ఆలస్యమైంది. గ్రామాల్లో ఒకరికి ఇచ్చి మరొకరికి ఇవ్వకుంటే గొడవలు జరిగే అకాశం ఉంది. ఏదేమైనా డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా లేని కారణంగా కందిపప్పు పంపిణీ చేపట్టలేదు.' అని సివిల్ సప్లైస్ డీటీ కె.మధు తెలిపారు.

బాధితులకు న్యాయం చేస్తా: ఎమ్మెల్యే బోనెల

● టౌన్ ప్లానింగ్ అధికారి అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అక్రమాల దర్యాప్తునకు ఆదేశించినట్టు ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. గురువారం ఆయన నియోజకవర్గ ప్రజలకు విజయదశమి నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ అధికారి అక్రమాలపై ఆరోపణలు వచ్చాయన్నారు. పట్టణంలో చాలా మంది వద్ద డబ్బులు తీసుకున్నట్టు, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. బాధితులు ముందుకు వస్తే న్యాయం చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ● ఇదిలా ఉండగా టౌన్ ప్లానింగ్ అధికారిపై ఆరోపణలు వస్తున్నా ఆ శాఖకు చెందిన జోనల్ అధికారులు కూడా కనీసం స్పందించలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ముగిసిన ఎంపీడీవోల బదిలీ ప్రక్రియ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎంపీడీవోల బదిలీ ప్రక్రియ ముగిసింది. మక్కువ ఎంపీడీవోగా డీడీ స్వరూపరాణి నియామకమయ్యారు. ఆమె డెంకాడ నుంచి బదిలీపై వస్తున్నారు. వై.పద్మజ కొత్తవలస నుంచి బదిలీపై ఎంపీడీవోగా నియామకమయ్యారు. పార్వతీపురం ఎంపీడీవోగా కె.రూపేష్, సీతానగరం ఎంపీడీవోగా మెంటాడలో పనిచేస్తున్న పి.త్రివిక్రమరావు, జియ్యమ్మవలస ఎంపీడీవోగా రామభద్రాపురంలో పనిచేస్తున్న కె.రమామణి, సాలూరు ఎంపీడీవోగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న రమాదేవిని నియమించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి బదిలీపై వస్తున్న ఎంపీడీవో జె.ఉమామహేశ్వరిని పాచిపెంట ఎంపీడీవోగా నియమించారు. ఈ విధంగా కొన్ని మండలాలకు సంబంధించి ఎంపీడీవోల నియామకం జరిగినట్టు సమాచారం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

పాలసీ హోల్డర్ల బోనస్ రేట్లను పెంచాలి



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఏజెంట్లు

బెలగాం: ఎల్ఐసీలో పాలసీ హోల్డర్ల బోనస్ రేట్లను పెంచాలని లియాఫీ పార్వతీపురం నాయకుడు ఎల్.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలసీ హోల్డర్స్ బోనస్ రేట్లను పెంచాలని, జీఎస్టీని రద్దు చేయాలని, పాత ఇన్సూరెన్స్ పాలసీల పద్ధతిని కొనసాగించాలని కోరారు. కొత్తపద్ధతిని రద్దు చేయాలని, లోన్‌పై వడ్డీ తగ్గించాలి, ఏజెంట్ల కమిషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లియాఫీ నాయకులు జగన్నాథం, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీడీగా గజాయిద్దీన్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం గిరిజన విద్యాశాఖ ఇన్‌చార్జి డీడీగా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి గజాయిద్దీన్‌ని నియమిస్తూ ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ గురువారం రాత్రి ఆదేశాలు విడుదల చేశారు. ఇప్పటివరకు డీడీగా పనిచేసిన రుక్మాండయ్యను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు సరెండర్ చేస్తూ ఇప్పటికే కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీడీగా గజాయిద్దీన్‌ను నియమితులయ్యారు.

సౌర విద్యుత్‌కు రిజిస్ట్రేషన్

భామిని: మండలంలోని గిరిజనులు సౌర విద్యుత్ రిజిస్ట్రేషన్‌కు ఆసక్తి చూపు తున్నారు. గురువారం పలు గిరిజన గ్రామాల నుంచి సబ్ స్టేషన్‌కు చేరుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నా రు. కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ యోజన పథకం కింద గిరిజనులకు కోసం ఇంటి వినియోగానికి సౌర విద్యుత్ సౌకర్యం కల్పిస్తోందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మంజూరైన వెంటనే బ్యాంకు ద్వారా రాయితీ ఇస్తూ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అయితే లబ్ధిదారులకు 200 స్క్వేర్ ఫీట్ రూఫ్ ఉండాలన్నారు. ఇప్పటివరకు మండలంలో 2,370 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేశామని ఆయన తెలిపారు.

రహదారులకు మరమ్మతులు చేయండి

సీతంపేట రూరల్: మండలంలోని గిరిజన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న, పాడైపోయిన రహదారులను వెంటనే బాగుచేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అప్పారావు, పి.సాంబయ్య.. ఐటీడీఏ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విలేకర్లతో మాట్లాడారు. పూతికవలస, పెదకంబ, దారబ, శంబాం ప్రాంతాల్లో వేసిన రోడ్లు నాణ్యత లేని కారణం వల్ల వేసిన కొద్దికాలంలోనే పాడైపోయాయన్నారు. మరో 15 రోజుల్లో పనులు ప్రారంభించకపోతే సీతంపేట ఐటీడీఏను ముట్టడిస్తామని వారు స్పష్టంచేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ: మండంలోని మక్కువ, మావుడి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ కె.గోపాలరావునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందన్నారు.

గ్రావెల్ తరలింపు అడ్డగింత



గ్రావెల్ ట్రాక్టర్‌ను అడ్డుకున్న అధికారి

వీరఘట్టం: మండలంలో మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈనేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు చోట్ల గురువారం అధికారులు తనిఖీలు చేశారు. యు.వెంకమ్మపేట గ్రామంలో గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, ఒక జేసీబీను సీజ్ చేశారు. వాటిని పోలీసులకు అందజేశామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.

14లోగా డిమాండ్లు నెరవేర్చాలి

● ఒడిశా ఆశా కార్మికుల సంఘం



భాస్కరచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ఒడిశా

రాయగడ: తమ న్యాయమైన డిమాండ్లను ఈనెల 14 లోగా నెరవేర్చకుంటే ఆందోళన చేస్తామని ఒడిశా ఆశా కార్మికుల సంఘం హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం సభ్యులు బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగేశ్వరదాస్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌చంద్ర రోయితని కలిసి, తమ గోడు విన్నవించుకున్నారు. ఆశా కార్మికులకు రూ.18వేల వేతనం, ఏదైనా కారణంతో మృతి చెందితే రూ.5లక్షలు పరిహారం అందజేయాలన్నారు. దీంతో పాటు ఉద్యోగ విరమణ అనంతరం నెలకు రూ.5వేలు చొప్పున పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రధానమంత్రి పేరిట రాసిన 6 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకి అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు తమల షాహుకార్, కార్యదర్శి గీతాంజలి హియాల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడిన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక న్యూకాలనీ పాత వివేకనంద పాఠశాల మలుపు వద్ద ఓ వ్యాన్‌ను లయన్స్‌క్లబ్ రహదారిలో వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణ(40), గణేష్ (25), టునా ముదిలి(24)లకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.

జై దుర్గాభవానీ

● ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
● అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
● గ్రామాల్లో వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ముందుగా ఘనంగా తిరువీధి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భవానీ దీక్షదారులు పాల్గొన్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)



కురుపాం రూరల్: నేరేడువలసలో పూజలందుకుంటున్న మాలతమ్మ



పార్వతీపురంటౌన్: అమ్మవారి తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న భవానీ స్వాములు



వీరఘట్టం: కుంకుమపూజలు చేస్తున్న మహిళలు ఇన్‌సెట్‌లో బాలా త్రిపురసుందరీదేవిగా కోటదుర్గమ్మ



పాలకొండ: కోటదుర్గమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



గరుగుబిల్లి: రావివలసలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



మక్కువ: శంబర పోలమాంబ ఆలయంలో హోమం



పాలకొండ: నక్కలపేటలోని సకల దేవతా ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు



భామిని: బత్తిలిలో పోలీసుల ఆధ్వర్యంలో దుర్గాదేవికి ఊరేగింపు దృశ్యం



సాలూరు రూరల్: పంచముఖేశ్వర ఆలయంలో బాలా త్రిపురసుందరి అవతారంలో అమ్మవారు



బలిజిపేట: అమ్మవారి మండపంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కురుపాం: కోటదుర్గమ్మతల్లికి వెండి వీణ బహూకరించిన దృశ్యం



సీతంపేట రూరల్: సీతంపేటలో సంతోషిమాత శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట

ప్రజాధనం దుర్వినియోగంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా

● కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస: గత ఐదేళ్లుగా ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి విధులకు హాజరు కాకపోయినా అతనికి అటెండెన్స్ వేసి జీతాలు ఎలా ఇచ్చారు.. ఇది నిజంగా క్షమించరాని నేరం.. ప్రజాధనం దుర్వినియోగమైన ఈ పరిస్థితిని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చినమేరంగి సీహెచ్‌సీలో ఆమె ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ఆసుపత్రిలో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో గైనికాలజిస్ట్ లేక గర్భిణులను కురుపాం సీహెచ్‌సీకి, పార్వతీపురం కేంద్రాసుపత్రికి పంపిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్‌కుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్ లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎక్స్‌రే మిషన్ లేక రేడియోగ్రాఫర్‌కు పనిలేకుండా పోయిందన్నారు. తర్వాత ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పౌష్టికాహారం, తదితర విషయాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. తర్వాత ఆసుపత్రిలో సెక్యూరిటీగార్డుగా నియమితుడైన ధనుంజయ అనే వ్యక్తి ఐదేళ్లుగా విధులకు రాకపోయినా అతనికి అటెండెన్స్ వేసి జీతాలు ఎలా ఇప్పిస్తున్నారని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఎంతమాత్రం క్షమించరాని నేరమన్నారు. అనంతరం వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, ఎంపీపీ బొంగు సురేష్‌తో కలిసి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ ఆలయానికి వీఐపీల తాకిడి

పాలకొండ: కోటదుర్గమ్మ దర్శనానికి గురువారం వీఐపీల తాకిడి కనిపించింది. అసిస్టెంట్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ స్టేట్ డైరెక్టర్ ప్రియాంకా నసిమ్ (ఐసీఏఎస్)తో పాటు ఆయన భార్య సింధూరరావు (ఐఈఎస్), ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, డీఎస్పీ ఎం.రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లా కొండలరావు, విజయనిర్మల దంపతులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

● అమ్మవారిని దర్శించడానికి వచ్చిన భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. మద్ది రామకృష్ణ కుటుంబ సభ్యులు కలిసి మొదటి రోజు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, నందాన రమేష్, రుద్ర కోటేశ్వరరావు, పి.మురళీకృష్ణ పర్యవేక్షించారు. దేవదాయ శాఖ ధర్మాదాయశాఖాధికారులతో పాటు కోటదుర్గమ్మ ఆలయ తాత్కాలిక ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లా కొండలరావు, గార దుర్గారావులతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ సభ్యులు, వలంటీర్లు ఉత్సాహంగా పనిచేశారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచండి



మాట్లాడుతున్న ఎంఈవో అప్పలనాయుడు

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగు పర్చేందుకు దృష్టి సారించాలని ఎంఈవో దత్తి అప్పలనాయుడు సూచించారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఆయన హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన చేయాలన్నారు. బడి బయట విద్యార్థులు ఉండకుండా పాఠశాలల్లో ఉండేలా శ్రద్ధ కనపర్చాలన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో బడి తోటల పెంపకం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 కె.కొండలరావు, హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, కొత్తూరు క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ బి.రామకృష్ణ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు ఉంటే తెలపాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలో విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్.చలపతిరావు కోరారు. మండలంలోని మండ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. పీవీటీజీ పథకం కింద ఇచ్చిన కొత్త సర్వీసులు వచ్చిన వారికి సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. విద్యుత్‌ను వినియోగదారులు పొదుపుగా వాడాలన్నారు. ఈ సమావేశంలో డీఈ గోపాలరావునాయుడు, సర్పంచ్ హైమావతి, ఏఈ రమేష్‌కుమార్, పంచాయతీ సిబ్బంది, కురుపాం, గుమ్మలక్ష్మీపురం సిబ్బంది పాల్గొన్నారు.

సంఘీభావానికి కృతజ్ఞతలు

మక్కువ: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావం తెలిపిన సాలూరు నియోజకవర్గ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ చెప్పారు. ఆయన గురువారం స్థానిక జనసేన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సంఘీభావం తెలిపిన వారికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు వెంపడాపు సుగుణేష్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం



ఊరేగింపులో ఆకట్టుకున్న బండ్ల వేషాలు

సాలూరు రూరల్: సాలూరు డబ్బివీధి కేహెచ్ స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన గణనాథుడికి గురువారం నిమజ్జన చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో బండ్ల వేషాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఇంకా జగన్ బొమ్మలే!



మావుడి ఆర్బీకేపై జగన్ బొమ్మ

సాలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా మావుడి గ్రామంలోని సచివాలయం, ఆర్బీకే వద్ద మాజీ సీఎం జగన్ ఫొటోతో నవరత్నాల బొమ్మలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం మారినా ఇంకా పాత పథకాల బొమ్మలు ఉంచడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా..

శాంతిభద్రతలు కాపాడాలి: ఏఎస్పీ



రికార్డులు తనిఖీచేస్తున్న ఏఎస్పీ అంకిత

మక్కువ: మక్కువ పోలీస్‌స్టేషన్‌ను ఏఎస్పీ అంకిత సురన గురువారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఏఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

కురుపాం ఎస్ఐగా నారాయణరావు

కురుపాం: కురుపాం ఎస్ఐగా పి.నారాయణరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన షణ్ముకరావు జి.మాడుగులకు బదిలీపై వెళ్లారు. దీంతో నారాయణరావును సాలూరు టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి కురుపాం నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా ప్రజల సహకారంతో విధులు నిర్వహిస్తానన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీ

పాలకొండ: పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డిని ఎంపీపీ బొమ్మాళి భాను, సుధాకరరావు దంపతులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. సబ్ కలెక్టర్‌ను శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. మండలంలోని పలు సమస్యలను ఆయనకు వివరించారు. ముఖ్యంగా లుంబూరు-పెదకోటిపల్లి రోడ్డు నిర్మాణం, పాలకొండ డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ ఉన్నారు.

ఆసుపత్రిలో పింఛన్ అందజేత

సాలూరు రూరల్: విజయనగరం మహారాజ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మరిపిల్లి గ్రామానికి చెందిన ఇప్పిలి చిన్నయ్యకు వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్ గురువారం వృద్ధాప్య పింఛన్ అందించారు. విజయనగరం వెళ్లి పింఛన్ ఇవ్వడం పట్ల బంధువులు ఆనందం వ్యక్తం చేశారు. సాలూరు మండలంలో శతశాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి తెలిపారు.

సస్యరక్షణపై దృష్టి సారించాలి

● గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'
● తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



సీతంపేట రూరల్: పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



వీరఘట్టం: రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో సౌజన్య

గరుగుబిల్లి: ఖరీఫ్ సమయంలో రైతులు పంటలకు సంబంధించి సస్యరక్షణ చర్యలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయ భారతి సూచించారు. మండలంలోని శివ్వాం, గొట్టివలస గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటకు సంబంధించి ఆశించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** మండలంలోని చలివేంద్రి, సంతనర్సిపురం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి సౌజన్య రైతులకు వ్యవసాయ పొలంలో పత్తి, వరి పంటల్లో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జా గ్రత్తలు వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. ● **సీతంపేట రూరల్:** మండలంలోని పనసనగూడ, కె.గుమడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖల అధికారులు, వీఏఏలు పాల్గొన్నారు. రైతులకు పలు సందేహాలను నివృత్తి చేశారు. వ్యవసాయ పంటలకు చీడపీడలు వచ్చేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పంట నష్టం పరిశీలన

మక్కువ: నంద గ్రామంలో మొక్కజొన్న పంట నష్టపోయిన రైతుల పొలాలను సాలూరు వ్యవసాయ శాఖ ఏడీ ఎం.మధుసూదనరావు గురువారం పరిశీలించారు. 9 మంది రైతుల పొలాల్లో 18 ఎకరాలు మొక్కజొన్న పంట నష్టం వాటిల్లిందన్నారు. వివరాలను జిల్లా వ్యవసాయాధికారికి వివరిస్తామన్నా రు. ఈ కార్య క్రమంలో మండల వ్యవసాయాధికారి బొత్స శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: అవగాహన కల్పిస్తున్న ఏవో విజయభారతి



మక్కువ: మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

సిబ్బంది లేరు.. వసతులు లేవు

● ఏళ్లు గడుస్తున్నా భర్తీకి నోచుకోని వైనం ● ఇదీ ఖండ్యాం, సంకిలి ఆయుర్వేద డిస్పెన్సరీల్లో పరిస్థితి


ఖండ్యాం ఆయుర్వేద డిస్పెన్సరీ

రేగిడి: మండలంలోని ఖండ్యాం, సంకిలి ఆయుర్వేద డిస్పెన్సరీల్లో సమస్యలు పాగావేశాయి. ప్రధానంగా సిబ్బంది లేకపోవడంతోపాటు వసతులు కొరవడడంతో సక్రమంగా సేవలందడంలేదు. ఇటీవల ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతుండడంతో ఓపీ కూడా పెరుగుతోంది. ప్రధానంగా సంకిలి డిస్పెన్సరీలో వైద్యాధికారి తప్ప కిందస్థాయి సిబ్బంది లేరు. సంకిలిలో ఒక్క వైద్యాధికారి మోహనరావు అన్ని రకాల పనులుచేయాల్సివస్తోంది. దీంతో ఆయనపై పనిభారం పడుతోంది. ఎంఎన్‌వో, అటెండర్ పోస్టులు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోవడంలేదు. ఆయుర్వేద వైద్యంపై గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే అవకాహన పెరుగుతుండడంతో ఇక్కడ ఓపీ ఎక్కువగా ఉంటోంది. ప్రతిరోజూ నాలుగైదు గ్రామాల నుంచి రోగులు వస్తున్నారు. దీంతో వైద్యాధికారి ఒక్కరే వారికి సేవలందించాల్సి వస్తోంది. ఖండ్యాం ఆయుర్వేద డిస్పెన్సరీలో నీటి సదుపాయం లేకపోవడంతోపాటు సరైన పర్నీచర్ అందుబాటులోలేదు. ఇన్వర్టర్ లేకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతే సేవలకు అంతరాయం కలుగుతోంది. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ప్రాంగణంలోకి పశువులు, కుక్కలు చొరబడుతున్నాయి. దశాబ్దకాలం కిందట నిర్మించిన భవనం కావడంతో తలుపులు, కిటికీలు పాడయ్యాయి. ఆస్పత్రి పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో ఇక్కడకి వచ్చే రోగులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ వైద్యాధికారి సునీల్‌కుమార్ ఒక్కరే సేవలందిస్తున్నారు. కాగా ఖండ్యాం, సంకిలి ఆయుర్వేద డిస్పెన్సరీల్లో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమేనని ఆయా డిస్పెన్సరీల వైద్యులు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

సాలూరు రూరల్: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సాలూరు రూరల్ ఎస్ఐ పి.నరసింహమూర్తి గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాచిపెంట మండలం చొక్కాపువానివలసకు చెందిన కోట నందీశ్వరరావు (21)కి మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని భార్య అనుమానించేది. దీంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. గురువారం ఉదయం కూడా ఇదే విషయమై దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో నందీశ్వరరావు తన ఆటోలో జీగిరాం వచ్చి ఓ తోటలో చెట్టుకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై భార్య నందిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

పాముకాటుతో వృద్ధుడి మృతి

గజపతినగరం: లింగాలవలస గ్రామానికి చెందిన కుమిలి రామకృష్ణ(64) పాముకాటుకు గురై మృతి చెందాడు. ఎస్ఐ కె.లక్ష్మణ రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామకృష్ణ గురువారం తన పత్తి చేనులో పురుగు మందు పిచికారి చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను గజపతినగరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సుకి త్రుటిలో తప్పిన ప్రమాదం

● 30 మంది ప్రయాణికులు సురక్షితం


అదుపు తప్పిన బస్సు

గుర్ల: విజయగనగరం నుంచి చీపురుపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ సురక్షితంగా ప్రయాణికులను కాపాడగలిగాడు. గురువారం విజయనగరం నుంచి చీపురుపల్లి వెళుతున్న పల్లె వెలుగు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అందులోని 30 మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అనారోగ్యం కారణంగా తనకు ఒక్కసారిగా కళ్లు తిరగడంతో బస్సు అదుపు తప్పిందని డ్రైవర్ తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

పైడిమాంబ హుండీలో నకిలీ నోట్లు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ హుండీలో నకిలీ నోట్లు దర్శనమిచ్చాయి. ఆలయ కల్యాణ మండపంలో అమ్మవారి చదురుగుడి హుండీని గురువారం లెక్కించారు. ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు మాట్లాడుతూ హుండీలో పాత ఐదు వందల నోట్లు నాలుగు, రూ. 2వేల నోటు ఒకటి, నకిలీ రూ.200 నోట్లు మూడు లభ్యమయ్యాయని తెలిపారు. ఈ విషయం దేవదాయశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి నుంచి తదుపరి వచ్చే ఉత్తర్వులను అనుసరించి వీటిని ఏమిచేయాలన్నది నిర్ణయిస్తామని చెప్పారు. హుండీ ద్వారా రూ.10,54,600 నగదు, బంగారం 12.10 గ్రాములు, వెండి 131 గ్రాములు వచ్చిందని ఈవో తెలిపారు.

21 కేజీల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైం: విజయనగరంలో రైల్వేస్టేషన్ సమీపంలో 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో రైల్వేస్టేషన్ ప్రాంతంలో పరిశీలించారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం రత్నాపూర్ పంచాయతీ బ్రాహ్మణినగర్‌కు చెందిన కబీరుద్దీన్ మంజూ ఆలీతోపాటు మరో మహిళను పట్టుకున్నారు. వారి నుంచి 21 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రూ.500 స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు..

జామి: జామి పరిధిలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరైన అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మరింత చేరువగా పోలీసు సేవలు: ఎస్పీ

విజయనగరం క్రైం: ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన విజయనగరం జిల్లా పోలీసు వెబ్‌సైట్‌ని ఆయన గురువారం ప్రారంభించారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులు, జిల్లా పోలీసుశాఖ జారీ చేసే వివిధ సర్టిఫికెట్లు, దరఖాస్తులు, పాస్ పోర్టుల వెరిఫికేషన్ స్థితి, తదితర వివరాలను ఈ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని ఎస్పీ తెలిపారు. ఏఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీసీ డైరెక్టర్ ఆర్.నరేంద్ర, జాయింట్ డైరెకర్ బాలసుబ్రహ్మణ్యం, ఆర్‌వీఆర్‌కే చౌదరి పాల్గొన్నారు. ● ఏఆర్ కానిస్టేబుల్ ఎం.దుర్గాప్రసాద్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయిలో జరిగిన ఆల్ ఇండియా యోగాసానాల చాంపియన్‌షిప్(2024-25) పోటీల్లో దుర్గాప్రసాద్ కాంస్య పతకం సాధించాడు. ఈ మేరకు దుర్గాప్రసాద్ ఎస్పీని కలిశారు.

మద్యం షాపులకు ఎనిమిది దరఖాస్తులు

విజయనగరం క్రైం: జిల్లాలో ఏర్పాటు చేయనున్న ప్రైవేట్ మద్యం షాపులకు సంబంధించి గురువారం ఎనిమిది దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీనాథులు తెలిపారు. శుక్రవారం మంచిరోజు కావడంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశముంది.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా రామచంద్రరావు

విజయనగరం క్రైం: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా పైడా రామచంద్రరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్‌లో విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా చిత్తూరులో బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో విజయనగరంలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు.

బొబ్బిలి ఆర్డీవోగా రామ్మోహనరావు

బొబ్బిలి: ఆర్డీవోగా రామ్మోహనరావు బాధ్యతలను స్వీకరించారు. శ్రీకాకుళం వంశధార యూనిట్-4 స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన ఆదిమూలం సాయిశ్రీ జమ్మలమడుగు బదిలీపై వెళ్లారు.

ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ

తెర్లాం: ఎంపీడీవోగా రేగు రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రామకృష్ణ బాడంగి బదిలీపై వెళ్లారు. **బాడంగి:** ఎంపీడీవోగా శంబంగి రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. తెర్లాంలో ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. **సంతకవిటి:** ఎంపీడీవోగా కె. సురేష్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన జీవీ రవికుమార్ పోలాకి ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. అలాగే మండల సర్వేయర్‌గా జి.అప్పలనాయుడు బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయనగరం జిల్లా వేపాడ మండలం నుండి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సత్యనారాయణ రాజాం టౌన్ సర్వేయర్‌గా బదిలీపై వెళ్లారు.

అధికారుల బదిలీ

లక్కవరపుకోట: స్థానిక డీటీ రాజేశ్వరరావు ఎస్.కోట, గ్రేడ్-1 వీఆర్వోలు రాధాకృష్ణ కొత్తవలస, గోవిందరావు చీపురుపల్లి, శ్రీరాములు మెరకముడిదాం బదిలీ అయ్యారు. గ్రేడ్-2 వీఆర్వోలలో మహేంద్ర సతివాడ, గోవింద వల్లూరు, కుమార్ చీపురుపల్లి బదిలీపై వెళ్లారు. ఈ మేరకు వీరిని తహసీల్దార్ ప్రసాదరావు అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

బొబ్బిలి రూరల్: గ్రామ, వార్డు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేవరాజు, ఉపాధ్యక్షులు భాస్కరరావు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే బేబీనాయన, జనసేన పార్టీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరుకు వినతిపత్రం అందజేశారు.

గణపతి ఆలయ వార్షికోత్సవం

వంగర: మండలంలోని కొప్పరవలసలో గురువారం గణపతి ఆలయ 14వ వార్షికోత్సవం నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపు జరిపారు. ఆలయ కమిటీసభ్యులు ప్రత్యేక అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు

వంగర: రైతుల నుంచి ఈ ఏడాది ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసినట్లు ఏవో కన్నబాబు తెలిపారు. గురువారం కొప్పరవలసలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

రేగిడి: రేగిడి శాఖా గ్రంథాలయానికి విజయనగరం దీరా ఫౌండేషన్ కాంపిటేటివ్ పుస్తకాలు వితరణగా అందించింది. గ్రంథాలయానికి ఫౌండేషన్ ప్రతనిదులు బొత్స సందీప్, పి.శ్రీనివాసరావు బుధవారం అందించినట్లు గ్రంథాలయధికారి పి.ఈశ్వరరావు తెలిపారు.


తెర్లాం: ప్రజాదర్బార్‌లో వినతిని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన


విజయనగరం రూరల్: అర్జీలను పరిశీలిస్తున్న అదితి గజపతిరాజు

సమస్యలు పరిష్కరించండి

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేలు వినతుల స్వీకరణ

విజయనగరం రూరల్: క్షేత్రస్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. గురువారం విజయనగరంలోని 13వ డివిజన్ పరిధిలోని 16వ సచివాలయంలో ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా పింఛన్లు, ఇళ్లు, రేషన్ కార్డులు, ఇంటి నిర్మాణానికి రుణాలపై ఎక్కువగా వినతులు అందాయి. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, చందక స్వప్నయాదవ్‌పాల్గొన్నారు.

●**తెర్లాం:** ప్రధాన సమస్యలు త్వరగా పరిష్కస్తామని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించారు. తొలుత నందబలగ గ్రామానికి చెందిన కొన పాల సంతోష్‌కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.43,690 చెక్కు ఎమ్మెల్యే అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నర్సిపల్లి వెంకటనాయుడు, నాయకులు వెంకటేశ్వరరావు,తహసీల్దార్ హేమంత్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనాలు పూర్తి చేయడానికి కృషి

●ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి


పీహెచ్‌సీ భవనం గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న లలితకుమారి

కొత్తవలస: కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో అసంపూర్తిగాఉన్న పీహెచ్‌సీ భవనాలను పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. గురువారం కొత్తవలస, వియ్యంపేటలో ఉన్న అసంపూర్తిగా ఉన్న పీహెచ్‌సీల భవనాలు, కొత్తవలసలో టీటీడీ కళ్యాణమండపానికి సంబంధించి రెవెన్యూశాఖ గతంలో మంజూరు చేసిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణయ్య, నాయకులు గొంప దుర్గాఉమేష్, నక్కరాజు చిన రాము, పీవీ రత్నాజీ, రమేష్, యల్లపుసూరిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు తగవు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున



మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

విజయనగరం (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం ఆయన విజయనగరంలో విలేకరులతో మాట్లాడారు. రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను రూ.3 వేలు చేయడానికి జగన్‌కు ఐదేళ్లు పట్టిందని, మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.3 వేల పింఛన్‌ను ఒకేసారి రూ.4 వేలు చేశామని తెలిపారు. వైసీపీ భోగాపురం విమానాశ్రయాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎయిర్‌పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. 2026 జనవరి నాటికి భోగాపురంలో విమానాలు ఎగురుతాయన్నారు. ఈ సమవేశంలో జిల్లా టీడీపీ కార్యదర్శి ఐవీపీ రాజు, ముద్దాడ చంద్రశేఖర్, విజ్జపు ప్రసాద్, రొంగలి పోతన్న పాల్గొన్నారు.

రంగారాయపురం గ్రామసభలో నిలదీత

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురంలో గురువారం రామాలయంవద్ద నిర్వహించిన గ్రామసభలో టీడీపీనాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొరెడ్ల ఈశ్వరరావు అధికారులను నిలదీశారు.టీడీపీకి చెందిన సర్పంచ్ కావడంతో రెండేళ్లు వారికి నచ్చినచోట అధికారులు గ్రామసభ నిర్వహించారని తెలిపారు. మండల, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, ఈవిషయంపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామసభ విషయంపై అధికారులకు తెలియజేస్తామని ప్రత్యేకాధికారి వీరలక్ష్మి తెలిపారు. కార్య క్రమంలో ఏపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు నమోదు చేయాలి

విజయనగరం క్రైం: జిల్లాలో విద్యుత్ చౌర్యంపై కేసులు నమోదు చేయాలని ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్ ఆదేశించారు. గురువారం విజయనగరంలోని ఏపీపీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్‌శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడేవారిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టరు కె.కృష్ణ, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ లక్ష్మణ రావు, డీఈ తిరుపతిరావు, ఈఈలు పూడి హరి, సురేష్‌బాబులు పాల్గొన్నారు. కాగా వెంకట రామకృష్ణ ప్రసాద్ గురువారం మూడులాంతర్లు వద్ద వున్న చదురుగుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సెల్‌టవర్ పనులు నిలిపివేయాలి

రాజాం రూరల్: గృహసముదాయాల సమీపంలో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ పనులు నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని మునిసిపాలిటీ పరిధిలో గల శాంతినగర్‌కాలనీ, కొండంపేట, మాదిగవీధి తదితర కాలనీ వాసులు కోరారు. గురువారం టవర్ ఏర్పాటు నిలిపివేయాలని కాలనీ ప్రజలు నిరసనతెలిపారు. అనంతరం రాజాం మునిసిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మనోజ్‌కుమార్, రాజశేఖరరావు, శ్రీనివాసరావు, పాపారావు, జీవరత్నం, రాములు, విమల పాల్గొన్నారు.

ఉత్సాహంగా మెగా హౌసీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట: విజయనగరంలో వినాయక చవితి పురస్కరించుకుని గురువారం వాజీ చానల్ నిర్వహించిన మెగా హౌసీ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాజీ చానల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తి చేయాలి

రాజాం:ప్రధానరహదారి పనులు పూర్తిచేయాలని టీడీపీ నాయకుడు కోండ్రు జగదీష్ కోరారు.గురువారం రాజాంలోని పాలకొండ రోడ్డులో జరుగుతున్న ప్రధాన కాలువల పనులను పరిశీలించారు. ఆయనతో పాటు గురవాన నారాయణరావు, నాగరాజు, వెంకటరావు, శాసపు రాజేష్‌కుమార్ ఉన్నారు.

ఆప్టోమెట్రీపై అంతర్జాతీయ వెబినార్



మాట్లాడుతున్న డాక్టర్ కుమారస్వామి

నెల్లిమర్ల: ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఆప్టోమెట్రీ విభాగంలో పరిశోధన, అభివృద్ధి అనే అంశంపై అంతర్జాతీయ వెబినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికాలోని ఆపిల్ విజన్ సైంటిస్ట్ డాక్టర్ దిబ్యేందుపుష్టి ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా స్వామి కంటి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ విజయ్‌బాబు, ఆప్టోమెట్రీ విభాగం అధిపతి సౌరజిత్ కుమార్ బెనర్జీ , ఐక్యూ ఏసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, అధ్యాపకులు శ్రావణి మేరెడ్డి, దినేష్ కుమార్ నాగుల శ్యామల, అలన తేజ, పి.ఈశ్వర్ పాల్గొన్నారు.

సోంపురంలో 'మన ఊరు-మన బడి'

వేపాడ: మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం దసరా వేడుకలను వైభవంగా నిర్వహించారు. హెచ్ఎం బీపీఏ రాజు ఆధ్వర్యంలో మన ఊరు-మన బడి నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలను చేర్పించాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సన్యాసినాయుడు, సర్పంచ్ మురుపిండి గంగరాజు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డుకు మరమ్మతులు చేయాలి

జామి: అలమండ రైల్వేస్టేషన్ రోడ్డు మరమతులు చేయాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడుబండారు పెదబాబు కోరారు.ఈ మేరకు జిల్లా పంచాయతీరాజ్‌శాఖ ఈఈకి వినతిపత్రం అందజేశారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీరో గోయ్యిల పథకంలో దీనిని చేర్చి మరమ్మతు చేస్తామని ఈఈ నాయుడు తెలిపారు.

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి: జేసీ

కలెక్టరేట్: జిల్లాలోని పత్తి రైతుల జాబితాను సిద్ధం చేసి కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. గురువారం ప్రత్తి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు తన చాంబర్‌లో సమీక్షించారు. నవంబరు రెండో వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. పత్తిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని తెలిపారు.సమావేశంలో మార్కెటింగ్ ఏడీ రవికుమార్ పాల్గొన్నారు

మార్లాపల్లిలో ముత్యాలమ్మ పండగ

లక్కవరపుకోట: మార్లాపల్లిలో గురువారం ముత్యాలమ్మ పండగను గ్రామ పెద్దలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ చెల్లించి మొక్కలు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగించి అనుపోత్సవం జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగాడ సత్యం పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు ముహూర్తపు రాట

వంగర: రుషింగిలో దుర్గాదేవీ కమిటీ ఆధ్వర్యంలో దేవీనవరాత్రులకు ముహూర్తపు రాటను గురువారం వేశారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో అమ్మవారికి కుంకుమ పూజలు, సామూహిక సత్యవ్రతాలతో పాటు పలు వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు రాజగోపాలరావు నాయుడు, రమేష్, దుర్గబాబు తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

బొబ్బిలి:డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష విరమణ పురస్కరించుకొని గురువారం రాత్రి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామిఆధ్వర్యంలో ఆధ్యాత్మికకార్యక్రమాలు నిర్వహించారు.ఈసందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బేబీనాయన పూజలుచేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామి రథాన్ని పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు రౌతురామ్మూర్తి, పువ్వల శ్రీనివాసరావు, భాస్కరరావు, జనసేన నాయ కులు పెద్దింటి మనోజ్‌కుమార్ (బాబీ), సందీప్, అడబాల నాగు పాల్గొన్నారు.

● **రాజాం రూరల్:** రాజాంలోని అంబేడ్కర్ కూడలిలో పవన్‌కళ్యాణ్ తిరుపతిలో గురువారం సాయంత్రం నిర్వహించిన వారాహి డిక్లరేషన్ బహిరంగ సభకు సంబంధించి లైవ్ ఏర్పాటు చేశారు. జనసేన ప్రచారకమిటీ రాష్ట్ర కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకుల సహకారంతో స్క్రీన్‌ను ఏర్పాటు చేసి వందలాది మంది లైవ్‌ను తిలకించేలా చర్యలు తీసుకున్నారు.

● **రేగిడి:** ఉంగరాడమెట్ట వేంకటేశ్వరాలయంలో జనసేన నాయకులు అధినేత పవన్‌కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి యూపీ రాజు ఆధ్వర్యంలో భజన లు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండల సమన్వయకర్త రెడ్డి బాలకృష్ణ, నేతలు పుర్లి అప్పలనాయుడు, నీలకంఠం, పాపారావు, సత్యంనాయుడు పాల్గొన్నారు.

గౌరవ వేతనం పెంచాలి

కలెక్టరేట్: గౌర వేతనం రూ.10 వేలకు పెంచాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కోరారు. గురువారం వేతనాలు పెంచి తమ సమస్యలును పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు బుగత అశోక్ మాట్లాడుతూ నిర్వాహకులు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారనిప్రభుత్వాలు మారినా వారి సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలోని ఏఐటీయూసీ నాయకులు డేగల అప్పలరాజు, పురం అప్పారావు, పెంకి లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

సీట్ల కేటాయింపు సమస్యను పరిష్కరించాలి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యలో జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన అభ్యర్థులపై ప్రభావితం చూపే కోటా సీట్ల కేటాయింపు సమస్యను పరిష్కరించాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు.ఈ మేరకు గురువారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిశారు. జాతీయస్థాయిలో ర్యాంకులు పొందిన అభ్యర్థులు రాష్ట్ర కోటా కింద సీట్లు పొందుతున్నారని తెలిపారు. దీంతో రాష్ట్ర రాంకర్లకు చాలా ఇబ్బంది కలిగిస్తోందని సీఎంకు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి డివిజన్ పరిధిలో 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ మక్కువ ఫీడర్‌లో నారశింహునిపేట సబ్ స్టేషను పరిధిలో గల గ్రామాలకు శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. లైన్‌లో నిర్వహణ పనుల వల్ల సరఫరా నిలిపివేయనుండడంతో సహకరించాలని కోరారు.

రేపు కోలాటం ప్రదర్శన

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లిలో శనివారం పూడివీధి రామ మందిరం నిర్వహణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాముడువలస రాధాకృష్ణ మహిళా కోలాటం బృందం కోలాటం ప్రదర్శన నిర్వహించనుందని తూర్పు భాగవత కళాకారుల అధ్యక్షులు బొంతలకోటి శంకరరావు తెలిపారు.

స్కిల్ హబ్ ఏర్పాటు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వీటీ అగ్రహారంలోని నాక్ శిక్షణ కేంద్రంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ సంస్థలు సంయుక్తంగా స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హబ్ ద్వారా శిక్షణ తరగుతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9866564273 , 8500960638, 99125 78754 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

పాఠశాలలు తెరిస్తే చర్యలు

రాజాం: దసరా సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు తప్పవని ఎంఈవోలు పి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు హెచ్చరించారు. గురువారం రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో స్థానిక చైతన్య పాఠశాలను పరిశీలించారు.

సంతకవిటిలో 'సంకల్పం'

సంతకవిటి: సంతకవిటిలో సంకల్పం కార్యక్రమాన్ని ఎస్ఐ గోపాలరావు నిర్వహించారు. ఈ సందర్భంగా కూడలిలో ఆటో డ్రైవర్లు, కిరాణా షాపుల నిర్వాహకులకు మాదకద్రవాల వల్లకలిగే నష్టాలను వివరించారు.

విత్తన బంతులతో మేలు

శృంగవరపుకోట: విత్తనాలతో తయారుచేసిన విత్తన బంతుల వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని గ్రీన్‌ఎర్త్ స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. గురువారం ఎస్.కోటలో వాసవీక్లబ్ సభ్యులు తయారుచేసిన ఐదువేల విత్తనబంతులు వివిద ప్రాంతాల్లో నాటారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికలు

శృంగవరపుకోట:ఎస్.కోట పీఆర్ షటిల్‌కోర్టులో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్- 14, 17 బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా కోచ్ శ్రీరాములు మాట్లాడుతూ పదిమంది క్రీడాకారులను ఎంపికచేశామని తెలిపారు. శుక్రవారం నుంచి జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎస్.కోట తరఫున వీరంతా పాల్గొంటాని చెప్పారు.

నిరంతరం బస్‌పాసుల జారీ

శృంగవరపుకోట: నిరంతరంగా పాస్‌లు జారీప్రక్రియ ఈనెల ఏడో తేదీ నుంచి చేపట్టనున్నట్లు ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ తెలిపారు. కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా బస్‌పాసులు జారీచేస్తున్నట్లు చెప్పారు.ఈ మేరకు శని, ఆదివారాల్లో బస్‌పాసు కౌంటర్ తెరుస్తామని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

బొబ్బిలి: పట్టణంలోని 29వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త పామోటి గురునాయుడుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.58 వేల చెక్కును ఎమ్మెల్యే బేబీనాయన అందజేశారు. గురునాయుడు ఇటీవల చార్‌ధామ్ యాత్రలో గాయపడడంతో ఆయనకు సీఎం సహాయ నిధినుంచి సహాయాన్ని బేబీనాయన గురువారం స్థానిక కోటలో పంపిణీచేశారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు గిరడ అప్పలస్వామి, బాబీ, సుంకరి సాయి రమేష్, ఎక్కుదు వాసు, ఏగిరెడ్డి శ్రీధర్, మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవరావు పాల్గొన్నారు.

దొరికిన సర్టిఫికెట్ల అందజేత

బొబ్బిలి: విశాఖ -దుర్గ్ ఎక్స్‌ప్రెస్ రైలు కిటికీలో నుంచి బొబ్బిలికి సమీపంలో ఎగిరిపడ్డ ఓ నిరుద్యోగి సర్టిఫికెట్లు అక్కడే పనిచేస్తున్న రైల్వే కార్మికుడు ఖలీల్ దొరికాయి. ఆయన వాటిని భద్రపరిచి అంటిపేట గ్రామానికి చెందిన యువకుడు ఏగిరెడ్డి హర్ష సర్టిఫికెట్లు అని గుర్తించి గురువారం అందజేశారు. సర్టిఫికెట్లను తనకు ఖలీల్ భద్రంగా అప్పగించినందుకు హర్ష కృతజ్ఞతలు తెలిపాడు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట:కులజనగణన నిర్వహించాలని ఈనెల 9న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నా విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం విజయనగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, కుల, జనగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు శివప్రసాద్, అశోక్, అంబేద్కర్, పైడిరాజు, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కార్యాలయం ప్రారంభం

విజయనగరం దాసన్నపేట: విజయనగరంలో పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయాన్ని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శు వి.రవీంద్రనాయుడు, డి.శ్రీనివాస్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసుల నాయుడు, ప్రతినిధులు శివప్రసాద్, రామినాయుడు, రామకృష్ణ, దిలీప్ పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌లో 'స్వచ్ఛతాహి సేవా'

విజయనగరం రూరల్: విజయనగరం శివార్లలోని జేఎన్‌టీయూ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని గురువారం భీమిలి బీచ్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా సాగరతీరంలో చెత్త తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు మణికుమార్, ధర్మారావు, వలంటీర్లు పాల్గొన్నారు.